క్లుప్తంగా

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం అవసరం



పట్నంబజారు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం గుంటూరు నాజ్‌సెంటర్‌లో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది మాక్ డ్రిల్ నిర్వహించారు. గుంటూరు–1, 2 అగ్నిమాపక కేంద్రాల నుంచి అగ్నిమాపక శకటాలు, వాటర్‌బ్రౌజర్లు, ర్యాలీగా బయల్దేరి మైక్ ద్వారా ఎలక్ట్రికల్ అగ్ని ప్రమాదాలు, వంట గదిలో ప్రమాదాలు, ఆసుపత్రి, హోటళ్లలో జరిగే ప్రమాదాలు, వాటి నివారణ జాగ్రత్తల గురించి వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం గోడ పత్రికలు అంటించి కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏవిధంగా నిలువరించాలనేది మాక్ డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ జిల్లా సహాయ అధికారి కె.కృష్ణారెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతిభావంతుల నిలయంగా హిందూ కళాశాల



గుంటూరు ఎడ్యుకేషన్: దశాబ్దాల చరిత్ర కలిగిన హిందూ కళాశాల ప్రతిభావంతుల నిలయంగా విరాజిల్లుతోందని కళాశాల కరస్పాండెంట్ చెరువు రామకృష్ణమూర్తి పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో సోమవారం ఇటీవల ప్రకటించిన ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో కళాశాల విశేష కృషి చేస్తోందని చెప్పారు. చదువుతో పాటు క్రమశిక్షణ, ఆటలకు ప్రాధాన్యతస్తున్నామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.మల్లికార్జునప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు దీటుగా హిందూ కళాశాల విద్యార్థులకు చక్కటి విద్య అందిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియెట్ విభాగం ఇన్‌చార్జి డాక్టర్ ఏ మంజుశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యాపకులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.


ఫ్యానుకు ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



కన్నయ్య మృతదేహం

గుంటూరు రూరల్: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం జూనంచుండూరు గ్రామానికి చెందిన సాదర బోయిన కన్నయ్య(36) మండలంలోని వెంగళాయాపాలెం గ్రామంలో పొలం కౌలుకు తీసుకుని సాగు చేశాడు. పంట సక్రమంగా పండక పోవటంతో దిగుబడి తగ్గింది. దీంతో నష్టం వాటిల్లింది. అప్పులు పెరిగి పోవటంతో తీవ్ర మనస్థాపానికి గురైన కన్నయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుని భార్య శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

షిరిడి సాయి సేవా సమితిలో జన్మదిన వేడుకలు



గుంటూరు ఎడ్యుకేషన్: కెనడీ విద్యాసంస్థల డైరెక్టర్ కె.శ్రీకాంత్‌బాబు సోమవారం తన జన్మదినం సందర్భంగా బ్రాడీపేటలోని షిరిడి సాయి దీన జన సేవాసమితిలో బాలలకు స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. శారీరక వైకల్యంతో బాధపడుతున్న బాలలతో కలసి కేకు కోసి ఆనందాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీవిద్య, కెనడీ నెక్ట్స్‌జెన్ కిడ్స్ పాఠశాల ప్రిన్సిపాల్ పీఎల్ హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కంతేరులో రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.30 లక్షల నగదును పట్టుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. కంతేరు శ్రీ సిటీ వెంచర్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన పత్తిపాటి వీరయ్య అనే వ్యక్తి కారులో రూ.1.30 లక్షల నగదును తీసుకొని వెళుతుండగా తనిఖీలలో పట్టుబడ్డాడు. అందుకు సంబంధించిన రశీదులు చూపించనందున ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

• ఆశీర్వదించండి



పశ్చిమ నియోజకవర్గంలో మంత్రి, అసెంబ్లీ అభ్యర్థి విడదల రజినితో సెల్ఫీ తీసుకుంటున్న ఓ మహిళ



ముత్యాలరెడ్డినగర్‌లో బండిపై ఇస్త్రీ చేస్తున్న మంత్రి విడదల రజిని



అమరావతి రోడ్డులో పండ్లు అమ్మే వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న మంత్రి విడదల రజిని - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ఎన్నికల విధులపై అవగాహన ఉండాలి

తూర్పు ఈఆర్‌ఓ కీర్తి చేకూరి

నెహ్రూ నగర్: ఎన్నికల విధులపై అందిస్తున్న శిక్షణను శ్రద్ధగా అవగాహన చేసుకుంటే పోలింగ్ సాఫీగా నిర్వహించడానికి వీలు కలుగుతుందని నగర కమిషనర్, గుంటూరు తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఈఆర్‌ఓ) కీర్తి చేకూరి తెలిపారు. 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల విధులు కేటాయించబడిన పీఓలు, ఏపీఓలకు సోమవారం స్థానిక ఏసీ కళాశాలలో నిర్వహిస్తున్న తొలివిడత శిక్షణను ఆమె పరిశీలించారు. శిక్షణలో వీడియో క్లిప్పింగ్స్, డెమో ఈవీఎంలపై ఈవీఎంలు, వీవీ ప్యాట్ కమిషనింగ్, మాక్ పోల్, ఫారం–17సీ, పీఓ డైరీ, ఇతర ఫారాలు నింపడం వంటి కీలక అంశాలపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ఉద్యోగుల నుంచి పోస్టల్ బ్యాలెట్‌కి సంబంధించి ఫారం–12ని సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓలు సునీల్, భీమరాజు, ఏఈఆర్‌ఓ వెంకటలక్ష్మి, డీఈఈ రమేష్ బాబు, ఎస్‌ఎస్ ఆయుబ్ ఖాన్, ఏఈ సునీల్ కుమార్, మేనేజర్ ఎస్‌ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్, తూర్పు ఈఆర్‌ఓ కీర్తి చేకూరి

దళిత ఉద్యమనేత కనపర్తి ఏసురత్నం

పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి

తెనాలి : ప్రజలతో పనిచేస్తూ వారిని నడిపించే వారే ఆర్గానిక్ మేధావులని అంటారని, దళిత ఉద్యమ నేత కనపర్తి ఏసురత్నం ఆ కోవకు చెందుతారని ప్రముఖ రచయిత ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. అయితానగర్ పొట్టి శ్రీరాములు పార్కులోని కమ్యూనిటీ హాలులో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా కనపర్తి ఏసురత్నంపై చల్లపల్లి స్వరూపరాణి సంకలనంలో వెలువరించిన 'ఆర్గానిక్ ఇంటలెక్చువల్ కనపర్తి ఏసురత్నం' పుస్తక ఆవిష్కరణ, పరిచయ సభకు కనపర్తి బెన్‌హర్‌బాబు అధ్యక్షత వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన స్వరూపరాణి మాట్లాడుతూ డెల్టా ప్రాంతంలో నాలుగు దశాబ్దాల పాటు దళిత సమాజం కోసం, కుల నిర్మూలన కోసం మార్క్సిజం, అంబేడ్కరిజం జమిలిగా ఉద్యమంలో కీలకపాత్ర వహించిన మహోన్నతుడు కనపర్తి ఏసురత్నం అన్నారు. ఆయన త్యాగాలు, ఉద్యమ జీవితం విస్మరించలేనివని, ఆయన అనుభవాలు భావితరానికి అవసరమన్నారు. ఆయన ఉద్యమ మిత్రులు తనతో కలిసి సమష్టిగా ఈ పుస్తకం తీసుకొచ్చినట్టు చెప్పారు. ఏసురత్నం ప్రతి వర్ధంతికి ఒక స్మారకోపన్యాసం ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. పుస్తకం తొలి కాపీని అందుకున్న కమ్యూనిటీ అండ్ రూరల్ సొసైటీ డైరెక్టర్ డాక్టర్ స్వర్ణలతాదేవి మాట్లాడుతూ ఏసురత్నం నాస్తికుడైనా, మార్క్సిజం పట్ల, అంబేద్కరిజంపైనా అచంచల విశ్వాసంతో దళిత ప్రజల అభివృద్ధికి కృషిచేశారని, అటువంటి వ్యక్తి జీవితాన్ని పుస్తకంగా తీసుకురావటం అభినందనీయమని చెప్పారు. ప్రధాన వక్త, న్యాయవాది పిల్లి విద్యాసాగర్ మాట్లాడుతూ దళిత మహాసభకు ముందే ఏసురత్నం అనేక ప్రతిఘటన పోరాటాలు నిర్వహించారని గుర్తు చేసుకున్నారు. వేము సమత, పిల్లి వాసు, సిద్దెల అబ్రహాం, మేకతోటి ప్రభాకరరావు, కనపర్తి డేవిడ్ ప్రసంగించారు. డాక్టర్ కనపర్తి అబ్రహాం లింకన్ వందన సమర్పణ చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రొఫెసర్ స్వరూపరాణి, అతిథులు

నవ సమాజ నిర్మాణానికి ఓటు ఆయుధం

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందని దానిని గుర్తెరిగి ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును రానున్న ఎన్నికల్లో వినియోగించుకోవాలని కొల్లిపర తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులు సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 'స్వీప్' కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గుప్తా డిగ్రీ కళాశాలలో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అందరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని సూచించారు. అందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను హాజరైన వారితో చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, గుప్తా డిగ్రీ కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రదర్శనలో పాల్గొన్న తహసీల్దార్ శ్రీనివాసులు, శేషన్న

మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు

డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి

లక్ష్మీపురం: క్రమబద్ధమైన ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ మధుమేహ వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు అని జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అధ్యక్షతన ఆరోగ్యంపై అవగాహన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షుగర్ వ్యాధి రావడానికి ప్రధాన కారణం అధిక బరువు, శారీరక శ్రమ తక్కువగా ఉండటం మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉండటం నిద్రలేమి కారణాలన్నారు. ఆరోగ్యవంతమైన ఆహారం తీసుకుంటూ మంచి అలవాట్లతో జీవనశైలిని పాటిస్తూ డయాబెటిస్ ముప్పుని ఎదుర్కోవచ్చన్నారు. ఆకుకూరలు ఎక్కువగా తినటం, జంక్ ఫుడ్ కి నో చెప్పటం, వ్యాయామంచేయటంతో పాటు అందుబాటులో ఉన్న నివారణ మార్గాల ద్వారా షుగర్ వ్యాధికి చెక్ పెట్టవచ్చన్నారు. డాక్టర్ శంకర్ రెడ్డిని సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి సంస్థ సభ్యులు టి.వి.సాయిరాం కోఆర్డినేటర్ గా వ్యవహరించగా, విద్యాధర కుమార్ పాల్గొన్నారు.



ఆరోగ్య సూత్రాలను వివరిస్తున్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కొమ్మారెడ్డి శంకర్‌రెడ్డి

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో పశ్చిమాసియాలో యుద్ధ సంక్షోభంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. విశ్లేషకులు, ప్రిన్సిపల్ రవిబాబు మాట్లాడారు. విద్యావేత్త టి.నారపరెడ్డి, సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కవితల పోటీలు

ఫిరంగిపురం: రాష్ట్రస్థాయి కవితల పోటీలకు కవితలను ఆహ్వానిస్తున్నట్లు కొండవీడు రచయితల సంఘం అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కార్యదర్శి తొళ్లమడుగు గోవిందయ్య సంయుక్తంగా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపోటీలకు కవితలు పంపదల్చుకున్నవారు చక్కని పదాలతో 20 లైన్లకు మించకుండా, పొడుగు వాక్యాలు రాయకుండా ఉండాలని చెప్పారు. వాటితోపాటు హామీ ప త్రం , పాస్‌పోర్టు ఫొటో, కవితను మూడు కాపీలుగా చేసి మే 15వ తేదీలోపు టి.గోవిందయ్య, కొత్తపేట, 14–198, ఫిరంగిపురం(పోస్టు), గుంటూరు జిల్లా చిరునామాకు పంపవచ్చని చెప్పారు. వివరాలకు 99663 85583 నెంబరులో సంప్రదించాలన్నారు. ప్ర థమ బహుమతి రూ.2వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యి నగదు అందజేస్తామన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: వ్యక్తి మృతి

తాడికొండ: ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందినట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. వివరాల ప్రకారం బండారుపల్లి గ్రామానికి చెందిన బొందలపాటి లాజరు(48) అనే వ్యక్తి గ్రామంలో చర్చి తిరునాళ్ల సందర్భంగా పక్క గ్రామంలో ఉన్న తన స్నేహితుడికి క్యారేజీ ఇచ్చి తిరుగు ప్రయాణంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని ఢీకొట్టడంతో గాయాల పాలయ్యాడు. స్థానికులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మరణించాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించి, మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం

నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గంగరాజు



తాడికొండ: ఎన్నికల నిర్వహణలో సంబంధిత అధికారులకు సమయపాలన పాటించడం, పూర్తి అవగాహన కలిగి ఉండటం తప్పనిసరి అని తాడికొండ నియోజకవర్గ ఎన్నికల రిటరినింగ్ అధికారి ఎం.గంగరాజు సూచించారు. సోమవారం లాం చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ప్రజలందరూ తమ ఓటు హక్కును ప్రశాంతంగా త్వరితగతిన వినియోగించుకునేందుకు సిబ్బంది పనితీరు ప్రధానమన్నారు. అందుకోసం వారికి సరైన అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా సమావేశాన్ని ఉపయోగించుకొని ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం ఏడుగురు మాస్టర్ ట్రైనర్లచే 290 మంది పీఓలు, ఏపీఓలకు శిక్షణ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తహసీల్దార్లు మధుసూధన్ రావు, సుధీర్ బాబు, రాజ్యలక్ష్మీ, రాఘవేంద్రరావు, డీటీలు కాకుమాను ప్రసాద్, రమేష్ బాబు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందనలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ప్రతిభావంతులుగా నిలవడం మంచి పరిణామమని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని కళాశాలలో సోమవారం ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా కేవీ బ్రహ్మం మాట్లాడుతూ కార్పొరేట్ విద్యాసంస్థలకు తీసిపోని విధంగా తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారని తెలిపారు. ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని పి.గౌస్య ఎంతో కష్టపడి చదివి సీనియర్ ఇంటర్ ఎంపీసీలో వెయ్యి మార్కులకు 951 మార్కులు సాధించిందని తెలిపారు. అదే విధంగా ఎంపీ మహేష్ 919, సీఈసీలో ఏ. వేణుగోపాలస్వామి 938, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో కె.రాజ్‌కుమార్ 406, మాబు సుభానీ 406, సీఈసీలో డి. రవితేజ 433, కె. రాణి 423 మార్కులను సాధించారని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఇంటర్ ఇన్‌చార్జ్ జి. సురేష్ కుమార్, డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

మానసిక వికాసానికి కవితలు దోహదం

గుంటూరు ఎడ్యుకేషన్: మానసిక వికాసానికి కవితలు దోహదం చేస్తాయని టీజేపీఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ తెలిపారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల తెలుగు విభాగ ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి నిర్వహించిన కవితల పోటీల విజేతలకు సోమవారం బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు కె. శ్రావణి, డాక్టర నిర్మల రాణి, ఆర్. జయశైలజ, పి. నాగమణి, భాగ్యమ్మ, అమూల్య, వరలక్ష్మి, దివ్య, సంగీత, శ్రావ్య పాల్గొన్నారు.



విద్యార్థులతో కేవీ బ్రహ్మం, మనోహర్, అధ్యాపక బృందం

కంతేరులో రూ.1.30 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రూ.1.30 లక్షల నగదును పట్టుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.
కంతేరు శ్రీ సిటీ వెంచర్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు నిర్వహిస్తుండగా మంగళగిరి మండలం నిడమర్రు గ్రామానికి చెందిన పత్తిపాటి వీరయ్య అనే వ్యక్తి కారులో రూ.1.30 లక్షల నగదును తీసుకొని వెళుతుండగా తనిఖీలలో పట్టుబడ్డాడు. అందుకు సంబంధించిన రశీదులు చూపించనందున ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

ప్రేమ, కరుణ, దానం.. ఇవే దేవుడి బోధనలు

మంత్రి విడదల రజిని



పట్నంబజారు: నిరాడంబరతే తమ మార్గంగా వినాయకుడు, సాయిబాబా ఈ లోకానికి చూపారని అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని తెలిపారు. పట్టాభిపురం, పాత గ్లూకోజ్ ఫ్యాక్టరీ రోడ్డులో సోమవారం శ్రీ మహాగణపతి, సాయినాథుని వాయుప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకుడు, సాయిబాబా మహిమలు ఎంతో గొప్పవని తెలిపారు. ఏ దేవుడైనా ప్రేమ, కరుణ, దానం.. లాంటి వాటి గురించే చెబుతారని పేర్కొన్నారు.

'మై డియర్ దొంగ' చిత్ర బృందం సందడి



పెదకాకాని: అభినవ్ గోమఠం, షాలినీ, దివ్యశ్రీపాద ప్రధానపాత్రల్లో సర్వజ్ఞకుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న కామెడీ ఎంటర్‌టైనర్ మై డియర్ దొంగ చిత్ర యూనిట్ సందడి చేసింది. ఈ చిత్రం ఏప్రిల్ 19న ఆహా ఓటీటీలో విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర బృందం సోమవారం మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలను సందర్శించింది. ఈ సందర్భంగా చిత్ర హీరో అభినవ్ గోమఠం మాట్లాడుతూ చిత్రం ఆద్యంతం హాస్య ప్రధానంగా సాగుతుందన్నారు. ఇటీవల విడుదలైన చిత్ర టీజర్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందన్నారు. అనంతరం చిత్ర బృందం సభ్యులు విద్యార్థులతో కలసి నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.

కోరిన కోరికలు తీర్చే కాశీవిశ్వేశ్వరుడు

గుంటూరు రూరల్: భక్తులు కోరిన కోరికలు తీర్చే దేవుడు కాశీ విశ్వేశ్వరుడని వైఎస్సార్ సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కిలారి వెంకటరోశయ్య, ప్రత్తిపాడు ఎమ్మెల్యే అభ్యర్థి బలసాని కిరణ్‌కుమార్‌లు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని గోర్లవారిపాలెం గ్రామంలో కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ముఖ్యఅతిథులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు మాట్లాడుతూ స్వామి దయతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు, పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అభయ సీతారామాంజనేయ స్వామికి పూజలు..

అర్బన్ మండలం 41వ డివిజన్ స్వర్ణభారతినగర్ ఈ బ్లాక్ 4వ లైనులో నూతనంగా నిర్మించిన అభయ సీతారామాంజనేయస్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో బలసాని కిరణ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. స్వామి దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆలయం కమిటీ సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థికి సాదర స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.